క్లుప్తంగా

తాటిచెట్టుపై నుంచిపడి గీతకార్మికుడి మృతి


బాలాజీ(ఫైల్)

ఎల్కతుర్తి: వృత్తిలో భాగంగా తాటిచెట్టు ఎక్కిన గీతకార్మికుడు ప్రమాదవశాత్తు కింద పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ సంఘటన భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తపల్లి గ్రామానికి చెందిన కాసగోని బాలాజీ (60) వృత్తిలో భాగంగా రోజు మాదిరిగానే తాటిచెట్టు ఎక్కి కల్లు తీస్తున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు మోకు జారీ కింద పడ్డాడు. గమనించిన స్థానికులు 108 వాహనంలో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బాలాజీ మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

హత్యాయత్నం కేసులో వ్యక్తి రిమాండ్

శాయంపేట : డబ్బుల విషయంలో గొడవపడి హత్యాయత్నానికి పాల్పడిన ఎర్రం రవిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ప్రమోద్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కాట్రపల్లి గ్రామానికి చెందిన ఎర్రం రవికి ఆదే గ్రామానికి చెందిన బానోతు దేవేందర్ రూ.1500 బాకీ ఉన్నాడు. డబ్బుల విషయంలో ఈనెల 8న రవి దేవేందర్‌తో గొడవపడి డబ్బులు ఇవ్వకుంటే చంపుతానని బెదిరించాడు. అదేరోజు రాత్రి దేవేందర్ కిరాణంకు వెళ్లగా అది గమనించిన రవి.. చాకుతో దాడి చేశాడు. దీంతో దేవేందర్ ఎడమ చేయ్యికి గాయమైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు రవిపై కేసు నమోదు చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు



కమలాపూర్ : మండలంలోని భీంపల్లి శివారులో రహస్యంగా పేకాడుతున్న ఆరుగురిని గురువారం రాత్రి అరెస్టు చేసినట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. భీంపల్లి శివారులో కొంతమంది రహస్యంగా పేకాడుతున్నారనే సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో భీంపల్లికి చెందిన రవి, భిక్షపతి, కుమారస్వామి, జయ్‌పాల్, వెంకటేష్, కుమారస్వామిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.10,330 నగదు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ దాడుల్లో ఎస్సై వీరభద్రరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం స్వాధీనం

దామెర : మండలంలోని ముస్త్యాలపల్లిలో వెలసిన బెల్ట్‌షాపులపై దాడులు నిర్వహించినట్లు ఎస్సై కొంక అశోక్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. గురువారం రాత్రి ముస్త్యాలపల్లి గ్రామానికి చెందిన రంగు మనీష్ బెల్టుషాపు నిర్వహిస్తున్నట్టు వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించగా అతని వద్ద రూ. 678, నడికూడ మండలం కంఠాత్మకూరు గ్రామానికి చెందిన మామిండ్ల మణెమ్మ నుంచి రూ. 3,150 విలువ చేసే మద్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



కమలాపూర్ : మండలంలోని కానిపర్తి గ్రామానికి చెందిన గౌరై రాధిక ఇటీవల మృతి చెందింది. ఆమె కుటుంబానికి స్నేహ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం 50 కిలోల బియ్యంతో పాటు కొంత నగదును అందించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మాదిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి రూ.2,300, పీఏసీఎస్ డైరెక్టర్ తక్కళ్లపల్లి సత్యనారాయణరావు రూ.3,000, ఫౌండేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ జనగాని సుమన్ రూ.2,016, గౌరవ అధ్యక్షుడు తొగరి హన్మయ్య రూ.1,100 చొప్పున ఆర్థికసాయం అందించారు. ఫౌండేషన్ అధ్యక్షుడు కొత్తూరి ఇంద్రసేన, ప్రధాన కార్యదర్శి సీతారాంరెడ్డి, ఉపాధ్యక్షులు సాంబయ్య, సంధ్యారాణి, గ్రామస్తులు చేరాలు, అశోక్, ఎల్లస్వామి, ప్రభాకర్, సురేష్ పాల్గొన్నారు.

నిరసన

శాయంపేట : పరకాల మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికురాలు చుక్క కమలపై జరిగిన దాడికి నిరసిస్తూ మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట పారిశుద్ధ్య కార్మికులు నిరసన తెలిపారు.

పగలే వెన్నెల!


కాకొండలో మధ్యాహ్నం సమయంలో వెలుగుతున్న వీధిదీపం

- రోజంతా వెలుగుతున్న వీధిదీపాలు
- జీపీలకు తప్పని అనవసర భారం
- పేరుకుపోతున్న విద్యుత్ బకాయిలు
- పట్టించుకోని సంబంధిత అధికారులు

నడికూడ : పంటల సాగుకు సరిపడా విద్యుత్ సరఫరా లేకపోవడంతో ఓ వైపు పొలాలు ఎండిపోతున్నాయి. కానీ గ్రామాల్లో మాత్రం రోజంతా వీధిదీపాలు వెలుగుతున్నా సంబంధిత అధికారులకు కనువిప్పు కలగడం లేదు. విద్యుత్‌ను పొదుపుగా ఉపయోగించుకోవాలనే ప్రభుత్వ ఆదేశాలను క్షేత్రస్థాయి అధికారులు బేఖాతరు చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. మండల కేంద్రంతోపాటు నడికూడ, ధర్మారం, నర్సక్కపల్లె, కాకొండ గ్రామాల్లోని వీధిదీపాలు పటగిపూటే వెలుగుతున్నాయి. ప్రస్తుతం విద్యుత్ అవసరాలు గణనీయంగా పెరిగిన కారణంగా అవసరానికి అనుగుణంగా ఉపయోగించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఉన్నతాధికారులు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. కానీ క్షేత్రస్థాయి అధికారులు ఆచరణ మాత్రం మర్చిపోయినట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో థర్డ్‌లైన్లను ఏర్పాటు చేశారు. సంబంధితశాఖ అధికారుల నిర్లక్ష్యంతో అక్కడక్కడ వీధిదీపాలు నిత్యం వెలుగుతూనే ఉన్నాయి. దీంతో మండలంలోని గ్రామపంచాయతీలకు అనవసరపు భారం మీదపడుతోంది.

ఆన్, ఆఫ్ స్విచ్‌లు ఉన్నా నిరుపయోగమే

వీధి దీపాలు కోసం థర్డ్ లైన్‌ను ఏర్పాటు చేసి ఆన్, ఆఫ్ స్విచ్‌లు అమర్చారు. జీపీ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ వాటిని ఉపయోగించడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు సైతం పట్టించుకోకపోవడంతో విద్యుత్ వృథా అవడంతో పాటు జీపీల్లో బకాయిలు పెరుగుతున్నాయి. వీటిపై దృష్టి సారించాల్సిన పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. కేవలం మండల కేంద్రంలోనే సుమారు 30 నుంచి 40 వీధిదీపాలు ఉన్నాయి. ఒక్కో విద్యుత్ బల్బుకు నెలకు రూ.100 చొప్పున విద్యుత్ బిల్లు వచ్చినా నెలకు రూ.3వేలు నుంచి 4 వేల వరకు జీపీపై అనవసరపు భారం పడుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి విద్యుత్ దుబారాను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు. విద్యుత్ పొదుపై చర్యలు తీసుకోవాలని అంటున్నారు.


నర్సక్కపల్లిలో..


నడికూడలో..


ధర్మారంలో..

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగాలి

- ఏసీపీ తిరుమల్


పోలీస్ కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

ఎల్కతుర్తి : రానున్న పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరగాలని కాజీపేట ఏసీపీ తిరుమల్ కోరారు. ఈ మేరకు సీఐ ప్రవీణ్‌కుమార్, స్థానిక ఎస్సై రాజ్‌కుమార్‌తో కలిసి శుక్రవారం మండలంలోని చింతలపల్లి, గోపాల్‌పూర్, జీల్గుల, పెంచికలపేట, శాంతినగర్, ఎల్కతుర్తి గ్రామాల్లో కేంద్ర బలగాలతో పోలీస్ కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నిల దృష్ట్యా గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రలోభాలకు లొంగకుండా ఓటు వేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర బలగాలు, స్థానిక పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

పత్తిపాకలో వాలీబాల్ పోటీలు ప్రారంభం

శాయంపేట : ఈనెల 14వ తేదీన నిర్వహించే అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం మండలంలోని పత్తిపాక గ్రామంలో అంబేడ్కర్ విద్యార్థి సమాఖ్య, బహుజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా బీఎస్ఎస్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు మొగ్గం సుమన్, ఏబీఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నాగుల పవన్‌కల్యాణ్, జిల్లా కార్యదర్శి నాలికే ప్రతాప్ వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడుతాయన్నారు. విద్యార్థులు, యువత వ్యసనాలకు బానిస కావద్దన్నారు. అంబేడ్కర్ ఆశయాలను కొనసాగించేందకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. క్రీడల్లో గెలుపొందిన వారికి ప్రథమ బహుమతి రూ.8,000, ద్వితీయ బహుమతి రూ.5,000 అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ క్రీడాకారులు పాల్గొన్నారు.

ఏకాగ్రతతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలి

- డాక్టర్ ప్రహసిత్


మాట్లాడుతున్న డాక్టర్ ప్రహసిత్

శాయంపేట : విద్యార్థులు ఏకాగ్రతతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని న్యూరో సైకియాట్రిస్ట్ డాక్టర్ ప్రహసిత్ అన్నారు. మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులకు పరీక్షల ఒత్తిడని తట్టుకునేందుకు శుక్రవారం మానసిక ఆరోగ్య కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులు పరీక్షలు రాసేందుకు భయపడొద్దని అన్నారు. ఒత్తిడిని అధిగమించే మెళకువలను వివరించారు. ప్రతీరోజు ఉదయం సుమారు గంటసేపు యోగా, ధ్యానం చేయడం వలన మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుభాషిణిదేవి, ఆశా వర్కర్ ప్రేమలత, ఉపాధ్యాయులు శ్రీజ, త్రివేణి, శ్రీలత, స్వప్న, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి


ప్రతిజ్ఞ పత్రాలు చూపుతున్న విద్యార్థులు

హన్మకొండ: ఓటర్‌గా నమోదైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం హనుమకొండలోని సెయింట్ పీటర్స్ పబ్లిక్ స్కూల్‌లో ఓటు హక్కు వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ మే 13న పార్లమెంట్ ఎన్నికలు జరుగనున్నాయన్నారు. తమ తల్లిదండ్రులు ఓటు హక్కు వినియోగించుకునేలా విద్యార్థులు ప్రోత్సహించాలన్నారు. జిల్లాలో ఓటింగ్ శాతం పెంచాలన్నారు. 30 రోజుల పాటు ఓటరు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ తల్లిదండ్రులతో ఓటు వేయిస్తామని ప్రతిజ్ఞ పత్రం రాసి ఇచ్చారు. ఇందులో డ్రాతీసి విజేత, 10వ తరగతి విద్యార్థి చక్రధర్‌కు పుస్తకాన్ని బహుమతిగా ఇచ్చారు.

ఎన్నికల్లో బీజేపీని ఓడించాలి

- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు నాగయ్య


మాట్లాడుతున్న కేంద్ర కమిటీ సభ్యుడు నాగయ్య

కరీమాబాద్: పార్లమెంట్ ఎన్నికల్లో మతతత్వ బీజేపీని ఓడించి వామపక్ష లౌకిక శక్తులను గెలిపించాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు జి.నాగయ్య అన్నారు. ఉర్సు గుట్ట సమీపంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తామని, ప్రభుత్వరంగ సంస్థలను కాపాడడమే కాకుండా విదేశాల్లో ఉన్న నల్లధనం వెలికితీసి దేశంలోని పేదలందరికీ పంచిపెడతామని వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన బీజేపీ వాటిని విస్మరించిందని విమర్శించారు. ప్రతీ ఏటా రెండున్నర కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పినా ఇప్పటి వరకు కేవలం వేల సంఖ్యలో మాత్రమే భర్తీ చేసిందని ఆరోపించారు. వ్యవసాయ రంగానికి చేయూతనివ్వాల్సిన ప్రభుత్వం కార్పోరేటీకరణ చేయడం కోసం మూడు రైతు వ్యతిరేక చట్టాలు తీసుకువచ్చిందని పేర్కొన్నారు. బీజేపీ పాలనను వ్యతిరేకిస్తున్న ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష పార్టీల నాయకులపై ఈడీ, సీబీఐ, ఇన్‌కంటాక్స్ శాఖల ద్వారా దాడులు చేయిస్తూ అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపుతుందని తెలిపారు. ఈసారి అధికారంలోకి వస్తే భారత రాజ్యాంగాన్ని మార్చేస్తామని బహిరంగ ప్రకటనలు చేస్తున్నారని పేర్కొన్నారు. దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలన్నీ ఒక్కొక్కటిగా ప్రైవేటీకరణ చేస్తుందని చెప్పారు. సమావేశంలో సీపీఎం రాష్ట్రకార్యవర్గ సభ్యురాలు రత్నమాల, జిల్లా కార్యదర్శి రంగయ్య, నాయకులు బాబు, రామస్వామి, సమ్మయ్య, కుమారస్వామి పాల్గొన్నారు.

నియామకం



పరకాల : బీజేపీ ఎస్టీ మోర్చా పరకాల అసెంబ్లీ ఇన్‌చార్జ్‌గా ఆ పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడు పాలకుర్తి తిరుపతిని నియమిస్తూ రాష్ట్ర కమిటీ ప్రకటించింది. కేంద్రంలో బీజేపీ ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు తనకు ఈ బాధ్యత అప్పగించిన రాష్ట్ర ప్రధానకార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ సిరంగి సంతోష్‌కుమార్, డాక్టర్ కాళీప్రసాద్‌రావు, కాచం గురుప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ జయంత్‌లాల్, పట్టణ అధ్యక్షుడు మార్త భిక్షపతికి తిరుపతి కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తానని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పనిచేస్తానని తెలిపారు. క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు తనవంతుగా కృషి చేస్తానని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి భారీ మెజారిటీతో గెలుపొందుతాని, అందుకు కార్యకర్తలు, నాయకులు కలిసి పనిచేయాలని ఆయన కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తానని ఆయన స్పష్టం చేశారు.

రాజకీయాలను వ్యాపారంగా మార్చేశారు

- ప్రజాసమస్యలు సృష్టిస్తున్న పార్టీలను తిరస్కరించాలి
- ఎంసీపీఐ(యూ) పొలిట్ బ్యూరో సభ్యుడు వల్లెపు ఉపేందర్ రెడ్డి



మాట్లాడుతున్న వల్లెపు ఉపేందర్‌రెడ్డి

వరంగల్ చౌరస్తా : రాజకీయాలంటే ప్రజలకు సేవ చేయడం మరిచి రాజకీయాలను వ్యాపారంగా మార్చివేశారని ఎంసీపీఐ(యు) పొలిట్ బ్యూరో సభ్యులు వల్లెపు ఉపేందర్ రెడ్డి విమర్శించారు. శుక్రవారం వరంగల్ అండర్ బ్రిడ్జి సమీపంలోని ఓంకార్ భవన్‌లో జరిగిన ఎంసీపీఐ(యు), బీఎల్ఎఫ్ సంయుక్త వరంగల్ పార్లమెంటరీ స్థాయి సమావేశం పార్లమెంట్ కన్వీనర్ నర్ర ప్రతాప్ అధ్యక్షతన జరిగింది. సమావేవానికి ముఖ్యఅతిథిగా ఉపేందర్ రెడ్డి హాజరై మాట్లాడుతూ రాజకీయాల్లో నీతి నిజాయితీ విలువలకు తిలోదకాలు ఇస్తున్న పార్టీలకు బుద్ధి చెప్పాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని కొల్లగొట్టిన వారే ప్రజలను మభ్యపెట్టి ఓట్లు దండుకొని గెలిచే ప్రయత్నం చేస్తూ గెలిచాక ఓట్లు వేసిన ప్రజలను దోచుకుతింటూ తరగని ఆస్తులను వెనకేసుకుంటున్నారని ఆరోపించారు. నీతిగా నిజాయితీగా విలువల కోసం కట్టుబడి ఉన్న బీఎల్ఎఫ్ లాంటి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్, వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి మాస్ సావిత్రి, కేంద్ర కమిటీ సభ్యుడు గోనె కుమారస్వామి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంద రవి ,రాష్ట్ర కమిటీ సభ్యులు నీల రవీందర్, గడ్డం నాగార్జున, బీఎల్ఎఫ్ జిల్లా నాయకులు రాగసుధా, జగదీశ్వర్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దు


కొనుగోలు కేంద్రాలను సందర్శించిన తహసీల్దార్

హసన్‌పర్తి : ధాన్యం విక్రయించడానికి కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దని తహసీల్దార్ చల్లా ప్రసాద్ అన్నారు. మండలంలోని నాగారం, పెంబర్తి, వంగపహాడ్, సిద్ధాపురం, పెగడపల్లిల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందికి తగిన సలహాలు సూచనలు చేశారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ తూకంలో ఎలాంటి లోటుపాటులో జరిగిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఆర్ఐ కుమారస్వామి, పీఏసీఎస్ చైర్మన్లు గోపాల్‌రెడ్డి, రాజేష్, ఏఓ అనురాధ, ఏపీఎం ప్రభాకర్ ఉన్నారు.

రేషన్ షాపు తనిఖీ

మండలంలోని పెగడపల్లిలోని రేషన్‌షాపును తహసీల్దార్ ప్రసాద్ తనిఖీ చేశారు.

బీఆర్ఎస్ గ్రామ కమిటీల ఎన్నిక



ఐనవోలు : మండలంలోని వనమాల కనపర్తి, కొండపర్తి, నర్సింహులగూడెం, ముల్కలగూడెం గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ గ్రామ కమిటీలను ఎన్నుకున్నట్లుగా మండల ఇన్‌చార్జ్ గుజ్జ గోపాల్‌రావు తెలిపారు. వనమాల కనపర్తి గ్రామాధ్యక్షుడిగా అధ్యక్షుడిగా సింగారపు చందర్, ప్రధానకార్యదర్శిగా కారంగుల రాజు, యూత్ అధ్యక్షుడిగా వల్లెపు నాగరాజు, కొండపర్తి అధ్యక్షుడిగా కంజర్ల సంపత్‌రావు, ప్రధానకార్యదర్శిగా ప్రభాకర్, యూత్ అధ్యక్షుడిగా సునీల్, నర్సింహులగూడెం అధ్యక్షుడిగా బాబు, ప్రధానకార్యదర్శిగా రాజు, యూత్ అధ్యక్షుడిగా రమేష్, అధ్యక్షుడిగా రాజు, ప్రధానకార్యదర్శిగా సంతాజీ, యూత్ అధ్యక్షుడిగా రంజిత్‌కుమార్ ఎన్నికైనట్లు తెలిపారు. నందనం సొసైటీ వైస్ చైర్మన్ చందర్‌రావు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఉస్మాన్‌అలీ, వైస్ ఎంపీపీ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి సరె.. కూలి డబ్బులేవీ..?

- జోరందుకున్న పనులు
- సౌకర్యాలు కల్పిస్తున్న అధికారులు
- డబ్బులు సకాలంలో చెల్లించాలని కూలీల వేడుకోలు


కమలాపూర్ : కానిపర్తి నల్లచెరువులో పూడికతీత పనులు చేస్తున్న కూలీలు

కమలాపూర్ : మండల వ్యాప్తంగా ఉపాధి హామీ పనులు జోరందుకున్నాయి. సుమారు 20 గ్రామాల్లోని చెరువుల్లో పూడికతీత పనులు జరుగుతుండగా.. ఐదు గ్రామాల్లో కాల్వల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, మట్టి తొలగింపు పనులు కొనసాగుతున్నాయి. మండలంలో మొత్తం 11,614 జాబ్ కార్డులు ఉండగా.. ఉపాధి పనుల కోసం 25,464 మంది కూలీలు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 6,889 జాబ్ కార్డులకు సంబంధించి 3,681 మంది కూలీలు పని చేస్తున్నారు. కాగా ఉపాధి హామీ పని ప్రదేశాల వద్ద ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు నీడ కోసం షేడ్‌నెట్లను ఏర్పాటు చేసి తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఫస్ట్‌ఎయిడ్ కిట్లు అందుబాటులో ఉంచారు. తమకు ఉపాధి పనులు, పనుల ప్రదేశాల్లో అన్ని రకాల వసతులు కల్పిస్తున్నప్పటికీ గత ఫిబ్రవరి15 వ తేదీ నుంచి ఏప్రిల్ నెలకు సంబంధించిన కూలీ డబ్బులు రావడం లేదని కూలీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా ఎండాకలంలో తాము రూ.100 పని చేస్తే అందుకు అదనంగా రూ.30 అలవెన్సు రూపంలో ఇచ్చేవారని, ప్రస్తుతం అలవెన్సు ఇవ్వడం లేదని కూలీలు వాపోతున్నారు.

ఓఆర్ఎస్ ఓకే.. నిలువ నీడ లేదు..

దామెర : మండలంలోని 14 గ్రామ పంచాయతీలకు గాను 2,822 జాబ్‌కార్డులు ఉన్నాయి. ఇందులో నేటి వరకు 1,680 మంది కూలీలు ఉపాధి హామీ పనికి వెళ్తున్నారు. అదే విధంగా మండుతున్న ఎండల కారణంగా ఆయా గ్రామాల్లో ఆశా వర్కర్లు పనులు చేసే చోటుకు వెళ్లి ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందిస్తున్నారు. అంతే కాకుండా జీపీ సిబ్బంది తాగునీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. కాగా కొన్ని గ్రామాల్లో పనులు చేస్తున్న చోట సేదతీరేందుకు నీడ వసతి లేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎండ తీవ్రత రోజురోజుకు అధికమవుతుందని, వెంటనే నీడ సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు. అలాగే డబ్బుల చెల్లింపులో జాప్యం చేయకుండా త్వరగా చెల్లించే విధంగా చూడాలని కోరుతున్నారు. మండుతున్న ఎండల దృష్ట్యా ఉపాధిహామీ కూలు జాగ్రత్తలు పాటించాలని అధికారులు పలు సూచనలు చేస్తున్నారు.


దామెర : ఏర్పాట్లు చేసిన షేడ్‌నెట్, తాగునీరు

డబ్బులు వెంటనే చెల్లించాలి



ఉపాధి పనులు సక్రమంగా కల్పిస్తూ పని ప్రదేశాల వద్ద నీడ సౌకర్యం, తాగునీరు, ఓఆర్ఎస్, ఫస్ట్ ఎయిడ్‌కిట్లు అందుబాటులో ఉంచుతున్నారు. కానీ గతంలో వేసవి కాలంలో రూ.100 పని చేస్తే రూ.30 అదనంగా అలవెన్సు ఇచ్చేవారు. ఇప్పుడు ఇవ్వడం లేదు. ఫిబ్రవరి నెల నుంచి ఇప్పటి వరకు చేసిన పనులకు సంబంధించిన కూలీ డబ్బులు ఇంతవరకు చెల్లించలేదు. అలవెన్సుతో పాటు మాకు రావాల్సిన డబ్బులు వెంటనే చెల్లించాలి. ఎండాకాలం దృష్ట్యా సౌకర్యాలు కల్పించడం సంతోషంగానే ఉంది. డబ్బులు సకాలంలో చెల్లించాలి.

- తోకల దేవేందర్‌రెడ్డి, కానిపర్తి

రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలి



శాయంపేట : రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీఐ రంజిత్‌రావు తెలిపారు. మండల కేంద్రం నుంచి కొత్తగట్టు సింగారానికి వెళ్లే రోడ్డుకిరువైపులున్న ముళ్లపొదలను శుక్రవారం తొలగింపజేశారు. ముళ్లపొదలు ఏపుగా పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో సీఐ రంజిత్‌రావు, ఎస్సై ప్రమోద్‌కుమార్ జేసీబీతో ముళ్లపొదలు, పిచ్చిమొక్కలను తొలగింపజేశారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. దీంతో వాహనదారులు పోలీస్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.